# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గురువారం 13 జూలై 2023


## మండలంలోని పురుగులు, ఎరువుల దుకాణాలలో ఆకస్మిక తనిఖీ

పెండ్లిమర్రి, జులై 12, ప్రభాతవార్త:



పెండ్లిమర్రి మండలంలో బుధవారం వ్యవసాయ సంచాలకులు (బద్వేలు) ఎం.నాగరాజు పురుగుల మందులు, ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. లైసెన్సులను, స్టాక్ రిజిస్టర్‌లను, రసీదు పుస్తకాలను, ఎరువులను మరియు పురుగు మందుల నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి ఒక్క రైతుకు బిల్లులను తప్పని సరిగా ఇవ్వాలని సూచించారు. ఎరువులను తప్పని సరిగా ఈపాస్ మిషన్ ద్వారానే అమ్మకం జరపాలని పేర్కొన్నారు. నాణ్యమైన విత్తనాలు, మందులను విక్రయించాలని ఎమ్మార్పీ ధరల కన్నా అధికంగా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొన్ని దుకాణాల్లో గోదావరి డీఏపీ నిల్వలను నిలుపుదల చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బ్లెస్సీ, వ్యవసాయ విస్తరణాధికారి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికి సంక్షేమ పథకాలు

### ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి

పీలేరు, జూలై 12ప్రభాతవార్తః



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని అగ్రహారం సచివాలయం, నెట్టిబండ కాలనీ, మొరం రెడ్డిగారిపల్లె, వడ్డిపల్లె నందు ప్రజలతో స్థానిక ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలందరికి కులమతాలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయా లేదా అని ప్రజలను ముఖాముఖిగా అడిగి తెలుసుకున్నారు. ఈకార్య క్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు, గ్రామ వలంటీర్లు, గహసారధులు పాల్గొన్నారు.

# మదనపల్లెలో రైతు దారుణ హత్య

### కాళ్ళు, చేతులు కట్టేసి హతమార్చిన వైనం - నింధితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు

మదనపల్లెక్రైం, జులై 12 ప్రభాతవార్త :

రైతు దారుణ హత్యకు గురైన సంఘటన మదనపల్లెలో మంగళవారం రాత్రి చోటు చేసుకొంది. రైతుకుకాళ్ళు, చేతులు కట్టేసి గొంతు నులిమి హత్య చేశారు. వివరాలిలావున్నాయి. మండలంలోని కొండామర్రిపల్లె పంచాయితీ బోడిమల్‌దిన్నెకు చెందిన మంచూరి రాజారెడ్డి అలియాస్ రాజశేఖర్‌రెడ్డి(60)రైతు ఇతనికి భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలు కలరు. కాగా మంగళవారం సాయంత్రం పాలు పితికి సమీపంలోని పాల కేంద్రానికి తీసుకెళ్ళాడు. ఈ క్రమంలో డిపోలో పాలు పోసిన అనంతరం రాత్రి 8గంటల సమయంలో తిరిగి ఇంటికి బయలుదేరాడు. దారిలో చెరువు మొరవ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. ఇందులో భాగంగా కాళ్ళు, చేతులు కట్టేసి గొంతుకు టవల్ బిగించి హత్య చేసి ఉండడాన్ని స్థానికులు గుర్తించి బాధిత కుటుంబ సభ్యులకు, తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. సిఐ సత్యనారాయణ సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి ఘటనపై ఆరా తీశారు. అయితే మృతదేహం పడి ఉన్న తీరును బట్టి చూస్తే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆస్థి వివాద గొడవలా, లేక వేరే ఇతర కకక్షలా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. కానీ కుటుంబసభ్యులు మాత్రం ఎలాంటి కక్షలు, గొడవలు లేవని చెబుతున్నారు. అనంతరం మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ పేర్కొన్నారు.



హత్యకు గురైన రైతు, సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

### డాగ్‌స్కాడ్‌తో తనిఖీలు :

రైతు దారుణత్యకు గురికావడంతో నింధితుల గాలింపుకోసం డాగ్‌స్కాడ్‌లు తనిఖీ చేసినట్లు డిఎస్‌పి కేశప్ప తెలిపారు. హతుని భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. నింధితుల ఆచూకి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టామని డిఎస్‌పి తెలిపారు. మృతదేహానికి శవపంచనామ పూర్తి చేసి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

### సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ:-

రైతు హత్యగావించబడిన సంఘటనా స్థలాన్ని ఎస్‌పి గంగాధర్‌రావు బుధవారం పరిశీలించారు. హత్యకు ముందు కుటుంబంలో జరిగిన విషయాలపై కుటుంబసభ్యులతో చర్చించారు. కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని డిఎస్‌పి, తాలూకా సిఐ సత్యనారాయణలకు ఆదేశించారు.

## నేడు కేంద్రమంత్రి నితిన్‌గడ్కరి మదనపల్లెకు రాక

### ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్

### పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య కేంద్రమంత్రి పర్యటన

మదనపల్లె, జులై 12 ప్రభాతవార్త :



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్‌పి, ఎమ్మెల్యేలు

కేంద్ర రవాణాశాఖామంత్రి నితిన్ గడ్కరి గురువారం మద్యాహ్నం మదనపల్లెకు విచ్చేస్తున్నారు. కేంద్రమంత్రి పర్యటన ఏర్పాట్లును బుధవారం జిల్లా కలెక్టర్ గిరీసా పిఎస్, జిల్లా ఎస్‌పి గంగాధర్‌రావు, జాయింట్ కలెక్టర్ పర్మాన్ అహమ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే నవాజ్‌బాషాలు పరిశీలించారు. సత్సంగ్ సౌండేషన్‌లో నూతనంగా నిర్మించిన ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రమంత్రిచే సత్సంగ్ పౌండేషన్‌లో నూతనంగా నిర్మించిన స్వస్థ్య ఆసుపత్రిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. మద్యాహ్నం తిరుపతి నుంచి హెలిక్యాప్టర్ ద్వారా బిటి కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకొంటారు. అక్కడ నుంచి సత్సంగ్ పౌండేషన్‌కు చేరుకొంటారు. ఈ కార్యక్రమంలో ఎటువంటి లోపాలు లేకుండా విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని స్థానిక డిఎస్‌పి కేశప్పకు సూచించారు. ఆసుపత్రి ప్రారంభం అనంతరం రోడ్డు మార్గాన బిటి కళాశాలలోని హెలిప్యాడ్‌కు చేరుకొని అటు నుంచి తిరుపతికి హెలిక్యాప్టర్‌లో వెలుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఎంఎస్.మురళి, సత్సంగ్ పౌండేషన్ నిర్వాహకులు ముంతాజ్‌అలి, రాష్ట్ర ఖనిజసంపద ఛైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ జింకా చలపతి, మున్సిపల్ కమీషనర్ ప్రమీల, తహశీల్దార్ మహమ్మద్‌చాంద్‌లు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## అప్పులబాధతో రైతు ఆత్మహత్య

వేంపల్లె, జూలై 12, ప్రభాతవార్త ః



ఆత్మహత్య చేసుకున్న రైతు సాంబశివారెడ్డి

వేంపల్లె మండలంలోని అలవలపాడు గ్రామానికి చెందిన ఎద్దుల సాంబశివారెడ్డి (35) అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. అలవలపాడు గ్రామానికి చెందిన ఎద్దుల సాంబశివారెడ్డికి దాదాపు 5ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. పంటల సాగుకోసం అప్పులు చేశారు. దిగుబడులు రాక నష్టాలు రావడంతో సుమారు రూ.13లక్షల మేర అప్పులు చేసినట్లు బంధువులు తెలిపారు. అప్పులు తీర్చలేక మంగళవారం రాత్రి ఇంటిలో పంటల కోసం తెచ్చిన పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బంధువులు చికిత్స నిమిత్తం నంద్యాలలోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తరలిస్తుండగా మార్గమద్యంలో సాంబశివారెడ్డి మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## మండల క్షేత్రస్థాయి అధికారుల సమీక్షా సమావేశం

వార్త IV వ పేజీలో

## మైనార్టీల ద్రోహి జగన్

### హజ్ హౌస్‌లు గాలికి - మైనార్టీల సంక్షేమ నిధులు నవరత్నాలకు మళ్లింపు

### శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్

రాజంపేట అర్బన్, జులై 12 ప్రభాతవార్త

మైనార్టీల అభివృద్ధి నిరోధక ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చెలాయిస్తుందని మైనార్టీల సంక్షేమ పథకాలకు పాతర వేశారని, శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్ ధ్వజమెత్తారు. జగన్ సర్కార్ మైనార్టీల అభివృద్ధి పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి లేకపోగా మోసం చేస్తూ నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. తెలుగుదేశంపార్టీ భవిష్యత్తు భరోసా చైతన్య యాత్ర బుధవారం రాజంపేట నియోజకవర్గానికి చేరుకుంది. రాజంపేట - రాయచోటి రోడ్డులోని ఎస్ఆర్ పాలెం వద్ద బస్సుయాత్రకు రాజంపేట అసెంబ్లి ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్‌రాయుడు, పార్టీ నియోజకవర్గ సీనియర్ నేత జగన్ మోహన్‌రాజుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున పార్టీశ్రేణులు వెళ్లి ఘనస్వాగతం పలికాయి. స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో షరీఫ్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి, రైల్వేకోడూరు టిడిపి నేత పంతగాని నరసింహప్రసాద్, జివెన్ నాయుడులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఈద్గాను షరీఫ్ పరిశీలించారు. అక్కడే ఏర్పాటు



చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ప్రతియేడాది మైనార్టీల సంక్షేమం కోసం 800 కోట్ల నిధులతో సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించి 2 వేల కోట్ల వరకు పెంచుకుంటూ పోయిన ఘనత చంద్రబాబుదే అన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం టిడిపి హయాంలో ప్రవేశపెట్టిన 16 పథకాలను జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నింటిని నిలిపివేశారన్నారు. హైదరాబాదుతోపాటు కడప, విజయవాడల్లో వందల కోట్ల వ్యయంతో (మిగతా IVవ పేజీలో)

## రాజంపేట తెలుగుదేశంలో భగ్గుమన్న విభేదాలు

రాజంపేట అర్బన్, జులై 12 ప్రభాతవార్త



తెలుగుదేశంపార్టీలో ఆధిపత్యపోరు రచ్చకెక్కాయి. పార్టీ ఆదేశాలతో జరుగుతున్న భవిష్యత్‌కు భరోసా యాత్రలో ఈ విభేదాలు రోడ్డుకెక్కాయి. ఒకదశలో బాహాబాహి వరకు వెళ్లాయి. బస్సుయాత్ర మార్గంలో జగన్‌మోహన్‌రాజు వర్గీయులు కట్టిన ప్లెక్సిలను, బ్యానర్లను బత్యాల వర్గీయులు ధ్వంసం చేశారు. నియోజకవర్గంలో ఆధిపత్యం కోసం బస్సు యాత్రలో అటు బత్యాల, ఇటు జగన్‌రాజులు బల ప్రదర్శనకు దిగారు. యువగళం యాత్రలో లోకేష్ నుంచి హెచ్చరికలు జారీ అయిన నేపథ్యంలో బత్యాల బస్సు యాత్రలో పట్టు నిరూపించుకునేందుకు ప్రయత్నం చేశారు. అందులో భాగంగానే బస్సుయాత్ర జరిగే ఎస్ఆర్ పాలెం నుంచి రైల్వే ప్లై ఓవర్‌బ్రిడ్జి వరకు పెద్దఎత్తున ప్లెక్సిలను కట్టించారు. అం తకంటే పోటీగా జగన్‌రాజు కూడా భారీ ప్లెక్సిలను, బ్యానర్లను ఏర్పాటు చేశారు. బుధవారం తెల్లవారుజామున బత్యాల వర్గీయులు కొందరు ప్లైఓవర్ ప్రారంభమయ్యే సమత్ థియేటర్ వద్ద నుంచి ఎస్ఆర్ పాలెం వంకు ఏర్పాటు చేసిన భారీ ప్లెక్సిలన్ని ధ్వంసం చేశారు. వెంటనే ఈ విషయాన్ని జగన్‌రాజు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. అనంతరం ఇరువురు నేతలు భారీగా జనసమీకరణకు పోటీపడ్డారు. ఈద్గా వద్ద షరీఫ్ ప్రెస్‌మీట్‌లో కూడా పోటాపోటీగా నినాదాలు చేశారు. బ్రాహ్మణపల్లె వద్ద, కూచివారిపల్లె వద్ద ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. పార్టీ సీనియర్ నేతలు, పోలీసులు సర్దిచెప్పారు. భోజనం అనంతరం జగన్‌రాజు తన వర్గీయులతో ఆర్ఎస్ రోడ్డులోని తన కార్యాలయం వద్ద నుంచి పాదయాత్రలో కలిసిన నేపథ్యంలో కూడా రైల్వేకోడూరుకు చెందిన ఇద్దరు తోయడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. అర్బన్ సిఐ నర సింహరాజు ఇరువర్గాలను వెళ్లాలని సూచించారు. అనంతరం పాతబస్టాండులో కూడా పోటాపోటీగా నినాదాలు చేశారు. 2 వర్గాలుగా విడిపోయి ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. అక్కడ కూడా ఘర్షణ వాతావరణం నెలకొంది. బస్సు యాత్ర కాస్తా పార్టీలో ఉన్న వర్గ రాజకీయాలను బహిర్గతం చేశాయి. ఫలితంగా పార్టీ శ్రేణుల్లో పటిష్టంగా ఉన్నవారు బహిరంగంగానే వర్గపోరుకు అధిష్టానం చెక్ పెట్టకపోతే ప్రత్యర్థులకు అవకాశం ఇచ్చినట్లు అవుతుందని వ్యాఖ్యానించారు.








## రేషన్‌లో కందిపప్పు మాయం.!

### చలనము లేని యంత్రాంగం..!! - అల్లాడిపోతున్న సామాన్యులు...!!!

రాయచోటి, జూలై 12 ప్రభాతవార్త :

ప్రజలకు నిత్యవసర వస్తువుల్లో అత్యంత ముఖ్యమైన వాటిల్లో కందిపప్పు ప్రధానమైంది. గత కొన్ని నెలలుగా రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు సరఫరా నిలిపివేశారు. బహిరంగ మార్కెట్లో రోజురోజుకు ధరలు పెరుగుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రేషన్ వాహనాల ద్వారా నాలుగు నెలల క్రితం వరకు అసంపూర్తిగా ఇచ్చేవారు, సరుకు తక్కువగా వచ్చిందని ముందు వచ్చిన వారికి ముందు ఇచ్చి తర్వాత అయిపోయాయని సమాధానం వచ్చేది మూడు నెలలుగా రేషన్ సరుకులు కందిపప్పు సరఫరా పూర్తిగా నిలిపివేశారు. బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధర పెరుగుతున్న ప్రభుత్వం ప్రత్యమ్నాయంపై దృష్టి సారించడం లేదు, 2017 -18 లో కందిపప్పు ధర రూ. 200 లకు చేరిన సమయంలో తెలుగుదేశం ప్రభుత్వం రాయితీపై కిలో రూ. 40లకు అందించింది. ఇదే ధరకు వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండేళ్లు కొనసాగించారు. 2021లో రేషన్ కందిపప్పు ధరను రూ. 67లకు పెంచారు వాహనాల ద్వారా సరఫరా కూడా పూర్తిస్థాయిలో చేయలేదు. గత ఏడాది కాలంగా అరా కొరగానే సరఫరా జరిగింది మూడు నెలల నుంచి పూర్తిగా నిలిపివేశారు అయితే ప్రస్తుతం మార్కెట్లో పెరిగిన ధరల పైన ఉన్నతాధికారుల స్పందించడం లేదు. రెండు నెలల క్రితం వరకు రిటైల్ మార్కెట్లో కిలో రూ.100 లు పలికిన కందిపప్పు గత నెలలో రూ.120ల నుంచి 130 కు పెరిగింది. గత వారం రోజుల్లో ఈ ధర 160 నుంచి 170 అమ్ముతున్నారు. ప్రభుత్వం పర్యవేక్షణ నియంత్రణ లేకపోవడంతో గత మూడు నెలల కాలంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన నిలువ చేసిన కందిపప్పును అధిక ధరలకు అమ్ముకుంటూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో మార్కెట్లో పెరుగుతున్న ధరలతో సామాన్యుడు అల్లాడిపోతున్నారు.రాష్ట్రంలో ఉత్పత్తి అయిన కందులు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అయ్యాయి దీంతో ప్రస్తుతం ఇతర దేశాల నుంచి దిగివచేసుకుంటున్నట్టు వ్యాపారాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ కర్ణాటక మహారాష్ట్రలో కంది సాగు అధికంగా (మిగతా IVవ పేజీలో)

## నేడు ఎంపిచే అమ్మఒడి మెగా చెక్కు పంపిణీ

### విజయవంతం చేయాలంటూ ఎమ్మెల్యే పిలుపు



మదనపల్లె, జులై 12 ప్రభాతవార్త :

జగనన్న అమ్మఒడి మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం రాజం పేట ఎంపి, లోకసభ పక్షనేత పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిచే గురువారం ఉదయం 11గంటలకు జరుగుతుందని ఎమ్మె ల్యే నవాజ్‌బాషా తెలిపారు. అమ్మఒడి చెక్కు పంపిణీ కార్యక్రమం కదిరిరోడ్డులోని టిప్పుసుల్తాన్ మైదానంలో సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. ఎంపి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బుధవారం ఎమ్మెల్యే నవాజ్‌బాషాతో పాటు జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్, జిల్లా ఎస్‌పి గంగాధర్‌రావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీఓ ఎంఎస్.మురళి, డిఎస్‌పి కేశప్ప, కమీషనర్ ప్రమీ లలు సభాప్రాంగణ ఏర్పాట్లును పరిశీలించారు. నియోజకవర్గంలోని అమ్మఒడికి సంబంధించి చెక్కులు పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖనిజసంపద ఛైర్‌పర్సన్ షమీంఆస్లాం, మున్సిపల్ వైస్‌ఛైర్మెన్‌లు జింకా చలపతి, నూర్ అజాం, మున్సిపల్ కమీషనర్ ప్రమీల, తహశీల్దార్ మహమ్మద్ చాంద్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. ఎంపి పర్యటన సందర్భంగా మదనపల్లెలో అమ్మఒడి పేరుతో ప్లెక్సీలు ఏర్పాటు చేశారు. అదే విధంగా ఎంపిని స్వాగతం పలుకుతూ త్వారణ ప్లెక్సీలు కూడా పట్టణంలో వెలిశాయి.

## నిలబడిన లారీ ఢీకొన్న కారు

# ఆరుమందికి గాయాలు



ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు, ప్రమాదంలో మహిళకు గాయాలు

రామాపురం, జూలై 12, ప్రభాతవార్త :

కర్నూలు - చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం చిట్లూరు పంచాయతీ పాలన్న గారిపల్లి సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నిలబడి ఉన్న లారీని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఫజూల్ రహిమాన్. షామీరా. ఆలియా. మరో ముగ్గురు చిన్నారులకు గాయాలైనట్లు ఎస్సై కొండారెడ్డి తెలిపారు. పోలీసుల కథల మేరకు వివరాలు ఎలా ఉన్నాయి. రాయచోటి పట్టణంలోని బోస్ నగర్‌కు చెందిన ఫజూల్ రహిమన్. సమీరా .ఆలియా మరో ముగ్గురు పిల్లలతో ఏపీ జీరో త్రీ ఎబి5588 నెంబర్ వల్ల కారులో కడప నుండి రాయచోటి వైపుకు పోతుండగా పాలన్నగారి పల్లె సమీపము రాగానే రోడ్డుపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొంది. ఈ సంఘటనలో 6 మందికి గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో ఫజురు రహిమాన్. షామీర్.వీరిని వేలూరుకి .ఆలియా. మరో ముగ్గురు పిల్లలను తిరుపతి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఉచితంగా ఎల్ఆర్జీ-52 కంది విత్తనాలు పంపిణీ

జమ్మలమడుగు, జులై 12, ప్రభాతవార్త:



ముద్దనూరు మండలం కొలవలి రైతు భరోసా కేంద్రంలో వంద శాతం రాయితీ తో ఉచితంగా 60మంది రైతులకు ఎల్ఆర్జీ- 52 అనే కంది రకం విత్తనాలను మండల వ్యవసాయాధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచితంగా తీసుకున్న కంది విత్తనాలను ప్రతి రైతు తమ పొలంలో సాగు చేసి పంట పండించాలని తెలిపారు. రైతులు తీసుకున్న కంది విత్తనాలను సాగు చేసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎవరైనా దుర్వినియోగం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకుడు వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

## జగనన్న ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

జమ్మలమడుగు, జులై 12, ప్రభాతవార్త:



రాష్ట్ర సీఎం ఎన్నికల ప్రచారం భాగంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విభాగంలో పని చేస్తున్న మున్సిపల్ వర్కర్స్‌లో పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూని యన్ జిల్లా కమిటీ సభ్యుడు విజయ్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సుధీర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 40వేల మంది మున్సిపల్ కార్మికులు, 123 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, నగర పంచాయతీలలో పనిచేస్తున్నా రని వారందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగన్న, శేఖర్, కోశాధికారి శివ, సీఐటీయూ నాయకుడు దాసరి విజయ్, పారిశుద్ధ్య కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన డిపో మేనేజర్ పి.వి.ప్రవీణ్

జమ్మలమడుగు, జులై 12, ప్రభాతవార్త:



జమ్మలమడుగు డిపోకు కొత్తగా వచ్చిన డిపో మేనేజర్ పి.వి.ప్రవీణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రీజనల్ కార్యదర్శి సుధాకర్, ఎన్ఎంయూఏ డిపో ప్రెసిడెంట్ బ్రహ్మం, డిపో కార్యదర్శి శివుడు గ్యారేజీ కార్యదర్శి ఎస్ఎం వలీలు ఆయనకు స్వాగతం పలికి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ డిపోలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తాననిపై అధికారులతో మాట్లాడి కొత్త సర్వీస్‌లను తెప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. జమ్మలమడుగు డిపోలో 2013-14 సంవత్సరాలలో అసిస్టెంట్ డిపో మేనేజర్‌గా పని చేసిన అనుభవం ఉందని ఆయన తెలిపారు.

## బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

కేవి.పల్లె, జూలై 12 ప్రభాతవార్తః



పాఠశాల విద్యార్థులు స్థూల నమోదు సర్వే వందవ రోజును పురస్కరించుకుని ఎంఈఓ ఆధ్వర్యంలో బుధవారం బడి బయట పిల్లల్ని గుర్తించి వారిని బడిలో చేర్పించడం జరిగింది. ఈసందర్భంగా ఎంఈఓ రెడ్డిబాషా, డి.సుబ్రమణ్యం రెడ్డి మాట్లాడుతూ మండలంలోని తల్లిదండ్రులు అందరూ తమ పిల్లలను తమ అవసరా నిమిత్తం పనుకు ఇంటి దగ్గర ఉంచుకోకుండా ఖచ్చితంగా తమ సమీపంలోని పాఠశాలలో చేర్పించిరోజు బడికి పంపాలని కోరారు. ఏ ఒక్క విద్యార్థి డ్రాపౌట్సుగా ఉండరాదని తెలిపారు. చీనేపల్లె ఉన్నత పాఠశాలలో వైకేపల్లె కాలనీకి చెందిన బడి మానేసిన కైలాష్ అనే విద్యార్థిని 9వ తరగతిలో చేర్పించడం జరిగింది. కార్యక్రమంలో చీనేపల్లె ఉన్నత పాఠశాల హెచ్ఎం ఉపనీత, సీఆర్పీ రవీంద్ర, వలంటీర్లు శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్వర్గీయ నల్లారి అమర్నాథ్‌రెడ్డి 37వ వర్ధంతి

పీలేరు, జూలై 12 ప్రభాతవార్తః



కలికిరి, వాల్మీకిపురం, చింతపర్తి, గుర్రంకొండలలో గల వ్యవసాయ మార్కెట్ యార్డులలో కీర్తిశేషులు నల్లారి అమ ర్నాథ్‌రెడ్డి విగ్రహాల దగ్గర కేవి.పల్లె గుండ్రేవారిపల్లె క్రాసులోని నల్లారి అమర్నాథ్‌రెడ్డి విగ్రహం వద్ద 13వ తేదీ గురువారం ఉదయం 9.30 గంటలకు నల్లారి అభిమానులు, తెదేపా కార్యకర్తలు అందరూ ఘన నివాళి అర్పించాలని కోరుచున్నాము. కలికిరి మార్కెట్ యార్డులో స్వర్గీయ శ్రీ నల్లారి అమర్నాథ్ రెడ్డి విగ్రహం వద్ద నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి గురువారం ఉదయం 9.30 గంటలకు ఘన నివాళులు అర్పించనున్నారు. నల్లారి అభిమానులు, తెదేపా నాయకులు కార్యకర్తలు వర్ధంతి వేడుకలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## భవన నిర్మాణ సంక్షేమం కోసం హెచ్ఎస్ఎమ్ సంస్థ

పీలేరు, జూలై 12 ప్రభాతవార్తః



హెచ్ఎస్ఎం సంస్థ ద్వారా రోడ్డు ప్రమాదంలో గాయపడిన గండబోయినపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ బుధవారం కలికిరి ఎంపీటీసీ బోగస్ తన వంతు సహాయంగా రూ.10వేలు అందించడం జరిగింది. ఈ సహాయం పది మందికి స్ఫూర్తిదాయకం ఇకపై భవన నిర్మాణ కార్మికులకు ఎటువంటి ఆపద వచ్చిన ఖచ్చితంగా తన వంతు సహాయం అందిస్తానని భోగస్ తెలిపారు. ప్రతి ఒక్క భవన నిర్మాణ కార్మికుడు తప్పక గుర్తింపు కార్డు కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ యువత భవన కార్మికులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## వైభవంగా బలిబండి కార్యక్రమం

కేవి.పల్లె, జూలై 12 ప్రభాతవార్తః



మండలంలోని మహల్‌రాజుపల్లె పంచాయతీ మహల్ క్రాసులో గత వారం రోజులుగా జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం జరిగిన బలి బండి కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా ప్రజలను పెద్ద ఎత్తున ఆకట్టుకుంది. ఉదయం బలిబండికి పూజలు నిర్వహించి గ్రామంలోకి ఊరేగింపుగా వెళ్లారు. ప్రతి ఇంటి ముందు పూజలుచేసి అన్నం తినుబండారాలు సేకరించారు. అనంతరం వాటిని మహాభారతం జరిగే స్థలానికి తీసుకువచ్చి భక్తులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, నిర్వాహకులు మదనమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## విద్యుత్ అంతరాయానికి సహకరించాలి

బ్రహ్మంగారి మఠం, జూలై 12 ప్రభాతవార్త :

మండల పరిధిలోని మల్లేపల్లె పంచాయతీ ఎద్దు లాయపల్లె 132/33 కెవి సబ్ స్టేషన్‌లో గురువారం ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు మండల విద్యుత్ ఏఈ రవి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధి లోని గ్రామీణ ప్రాంత రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడానికి నిర్వహణ పనులు చేపట్టడం వలన విద్యుత్ అంతరా యం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని మండల పరిధిలో ఉన్న టి.చౌదరివారిపల్లె, బి.మఠం, మల్లేపల్లె సబ్ స్టేషన్లకు ఉదయం 9 నుండి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, రైతులు, ప్రజలు సహకరించాలని ఏఈ రవి శంకర్ తెలిపారు.

## మిట్టమానుపల్లెలో జగనన్న సురక్ష కార్యక్రమం

మైదుకూరు జులై 12, ప్రభాతవార్త



మైదుకూరు మండల పరిధి లోని మిట్టమానుపల్లె గ్రామంలో బుధవారం మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి ఆధ్వర్యం లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దరఖాస్తుదారులకు మంజూరైన సర్టిఫికెట్లను ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. టిడిపి ప్రభుత్వంలో కాళ్ళు అరిగేలా తిరిగిన మంజూరు కానీ మా సర్టిఫికేట్లు ఇప్పుడు జగనన్న ఇంటికే పంపడంతో సిఎం జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియ జేశారు. కార్యక్రమంలో మండల వైస్ ప్రెసిడెంట్ ఊటుకూరు రఘు రామిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ అన్నపురెడ్డి శ్రీమన్నారాయణ రెడ్డి. సింగిల్ విండో ప్రెసిడెంట్ మూలె సుధాకర్ రెడ్డి, సంబటూరు ప్రసాద్ రెడ్డి మండల రెవెన్యూ అధికారి అనురాధ, బొర్రా సాంబ శివారెడ్డి, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఆర్టీసీ ఉద్యోగులకు ఆదర్శ ఉత్తమ ప్రతిభా ప్రశంసపత్రం అందజేత

మైదుకూరు జులై 12, ప్రభాతవార్త



మైదుకూరు డిపోలో పని చేస్తున్న ఉద్యోగులకు బుధవారం మైదుకూరు ఆర్టీసీ డిపో నందు ఆదర్శ ఉత్తమ ఉద్యోగుల అభినంద సభ నిర్వ హించారు. ఈ సభలో ఆదర్శ ఉత్తమ ఉద్యోగులకు డిపో మేనేజర్ శ్రీని వాసులు, ట్రాఫిక్ ఇంచార్జ్ ఏ. మంజుల చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందజేశారు. ప్రశంస పత్రం అందుకున్న వారిలో కేసి కొండయ్య- కండక్టర్, జి. రెడ్డయ్య -కండక్టర్, ఎం ఎస్ నారాయణ- డ్రైవర్, జి.శ్రీనివాసులు- డ్రైవర్, ఎం.ఎస్. మన్యం- డ్రైవర్,ఆర్. బాబు -మెకానికల్, బి శ్రీరాములు- డ్రైవర్, ఎం. లక్ష్మయ్య జనరల్ ఏడిసిలకు ప్రశంస పత్రాలు బహుమానంగా అందజేశారు.

## షెడ్‌నెట్ కూరగాయ నర్సరీ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

రామసముద్రం జులై 12, ప్రభాతవార్త



నర్సరీ నిర్వాహకులు పాటిం చాలని మదనపల్లి డివిజన్ ఉద్యన అధికారి ఇ.ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి తెలి పారు రామసముద్రం మండలం లోని పలు గ్రామాల్లో ఏర్పా టు చేసిన షెడ్ నెట్ నర్సరీ లను బుధవారం పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. నాణ్యమైన విత్తనాలను మాత్రమే ఉపయోగించాలి రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు .మొక్కల విక్రయించే సమయంలో విత్తనం తాలూకు పూర్తి సమాచారంతో రసీదులను అందించా లన్నారు. నర్సరీల పేరు కనిపించేలా ప్రత్యేక సూచిక బోర్డులు ఏర్పాటు చేయా లన్నారు నర్సరీ లైసెన్స్ నెంబరు ప్రింట్ అయిన బిల్లు మాత్రమే రైతులకు ఇవ్వాలి. నర్సరీ లోపల పసుపు బులుగు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయాలి ప్రతి బెడ్డుకు ముందు ఆ బెడ్డులో పోసిన నారును సూచిస్తూ కంపెనీ ,వెరైటీ నాటిన తేదీ వివరాలు గల బోర్డును ఏర్పాటు చేయాలన్నారు పైన తెలిపిన నిబంధనలు పాటించని నర్సరీ నిర్వాహకులపై తగిన చర్యలు తీసు కోవడం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఉద్దిన అధికారి ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి వ్యవసాయ అధికార సిబ్బంది సాయి ప్రీతం పాల్గొన్నారు.

## పేద ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి ఆకాంక్ష

రామసముద్రం జులై 12, ప్రభాతవార్త



మండలంలోని కుదురు చీమనపల్లె నడింపల్లెలో జగ నన్న సురక్ష కార్యక్రమ, సచివాలయా పరిధిలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించారు. రెండు బృందాలుగా ఏర్పడి సమస్యలను పరిష్క రించారు. కుదురుచీమనపల్లె సర్పంచ్ శ్రీనివాసలు రెడ్డి సచివాలయ పరిధిలో ఎంపీపీ కుసుమకుమారి అధ్యక్షతన సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజలకు పలు అంశాల పైన, వైస్ ఎంపీపీ రమణ రెడ్డి, మాట్లా డుతూ ముఖ్యమంత్రి జగన్‌అన్నపేదల పక్షపాతి మహిళలకు ఎన్నో సక్షేమ పథకాలు చేశారని అన్నారు, కేసీ పల్లె పంచాయతీలో ఎన్నో అభివృద్ది పనులు చేశారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ భాస్కర్‌గౌడ్, మండల సచివాలయ కన్వీనర్ నందరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు తిమ్మయ్య రాధరెడ్డి,సి హెచ్ ప్రకాష్ తిమ్మయ్య. సర్పంచ్, సుబ్బారెడ్డి, ఉదయశంకర్ రెడ్డి. కన్వీనర్ బాబు తిప్పరాజు, శ్రీనివాస్రాజు రాజారెడ్డి, రెడ్డివీరేగౌడు, తహసీల్దార్ దైవరాజన్, ఏపీ డీఓలక్ష్మీపతి ఎంపిడిఓ నారాయణ స్వామి, డీటీ శ్రీ నివాసులు, ఏఇ. మస్తానవల్లీ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఎస్సి సెల్అధ్యక్షులు కృష్ణప్ప, సచివాలయ కన్వీనర్లు, గ్రామ వాలంటీర్లు, గృహ సారదలు, ప్రజా ప్రతినిధులు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మోడల్ ఆసుపత్రిని పరిశీలించిన సీపీవో సుదర్శన్‌రెడ్డి

ఒబులవారిపల్లె, జులై 12,

ప్రభాతవార్త:



ఓబులవారిపల్లె మండలం మంగంపేట ఏపీఎండీసీ సంస్థ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఏపీఎండీసీ మోడల్ ఆసుపత్రి ఆద్య మెడికల్ ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందించి వైద్యులు అందుబాటులో ఉండాలని సీపీవో సుదర్శన్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆసుపత్రిలో ఉన్న మందులను షుగర్, బీపీ తదితర ల్యాబ్ టెక్నీషియన్ సంబంధించిన పరికరాలను యంత్రాలను పరిశీలించారు. రోగులకు అసౌకర్యాలు కలగకుండా రోగులు వ్యాధిని బట్టి వారికి సరిపడా మందులను పంపిణీ చేయాలని మేనేజర్ అశోక్‌కుమార్‌రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది దిలీప్‌కుమార్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## మోక్షిత్ లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్‌కు నిధులు మంజూరు

రాయచోటి టౌన్, జూలై 12ప్రభాతవార్త:



రాయచోటి నియోజకవర్గం సంబేపల్లె మండలం ప్రకాష్ నగర్ కాలనీ ఊటు పాలెంనకు చెందిన బొళె ్ళం సురేంద్రనాయుడు కుమారుడు మోక్షిత (ఒకట న్నర సంవత్స రం వయస్సు)లివర్ ట్రాన్స్ ప్లాంటే షన్ వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.10 లక్షలు విలువ చేసే ఎల్ఓసి లేటన్‌ను బుధవారం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. మోక్షిత్ పుట్టి రెండు నెలల తరువాత లివర్ వ్యాధి బయట పడడంతో తిరుపతి, చెన్నైలలో తల్లిదండ్రులు వైద్యం చేయించినా మెరుగుపడలేదు. లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ చేస్తేనే ఆరోగ్యం మెరుగు అవుతుందని, ఇందుకు లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని చెన్నైలో గ్లోబల్ ఆసుపత్రి వైద్యులు సూచించారన్నారు. నిరుపేదలైన తాము ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని కలిసి తమ బిడ్డ పరిస్థితి గురించి వివరించామన్నారు. ఇందుకు తక్షణం స్పందించిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తామని భరోసా ఇచ్చిన తమ దరఖాస్తును సిఎం క్యాంప్ కార్యాలయానికి త్వరితగతిన సిఫారసు చేసి లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ కోసం రూ.10 లక్షలు నిధులను ప్రభుత్వం నుంచి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మంజూరు చేయించారని, సిఎం జగన్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిల మేలు మరువలేమని ఆ కుటుంబ సభ్యులు తెలిపారు. అలాగే మోసపేటకు చెందిన హర్షద్ ఒకటిన్నర లక్ష చిన్నమండెం మండలం బోనమల గ్రామం నాగూరి వాండ్లపల్లికి చెందిన మల్లమ్మకు 25 వేల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అందజేశారు.

## మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించండి

### ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు రూరల్, జులై 12 ప్రభాతవార్త



రైల్వేకోడూరు మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి అభివృద్ధికి మారు పేరుగా ఉండాలని రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీని వాసులు అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ ఎ.జాషువా ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ముఖ్యమంత్రి ఆదేశాలను తు.చ పాటించి జగనన్న కాలనిల్లో వేగవం తంగా నిర్మాణాలు చేపట్టి అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న పనులను విజయ వంతం చేయాలని వారు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధిని సాధించేదిశగా ప్రణాళికలను సిద్ధం చేసి ఉన్నారని, ప్రతిఒక్కరు బాధ్యతాయుతంగా పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలోనడిపించాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంజం సుకుమార్ రెడ్డి, రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉప సర్పంచ్ సాయి, బుడిగి శివయ్య, హౌసింగ్ డిఇ కుప్పుస్వామి, ఆర్‌డబ్ల్యుఎస్ రమేష్, ఎన్‌జిఒ అధ్య క్షులు పి.ఓబులేశు, సర్పంచ్‌లు నాయిని హరిక్రిష్ణారెడ్డి, చియ్యవరం విష్ణు, మార్కెట్‌కమిటి ఛైర్మన్ ముద్దలూరు సుబ్బరామరాజు, సొసైటి ఛైర్మన్ సుదర్శన్‌రాజు, దొమ్మరాజు సుబ్రమణ్యంరాజు, ఆనాల కవితా చెంగల్‌రెడ్డి, గోపి, శ్రీరామ్‌వినోద్, యామల రాజాతో పాటు జిల్లా కోఆప్షన్ మెంబర్ అన్వర్‌బాషా, జడ్‌పిటిసి పాలెంకోట రత్నమ్మ, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష ఆంధ్ర ప్రజలకు ఒక వరం

రైల్వేకోడూరు రూరల్, జులై 12 ప్రభాతవార్త



రాష్ట్రంలో జగనన్న సురక్ష ఒక అద్భుతమైన పథకమని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని రెడ్డివారి పల్లె సచివాలయం-5 లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్దిదారులకు పలురకాల సర్టిఫికెట్లను అందజేసి బాధితులకు అండగా వైసిపి ప్రభుత్వం నిలుస్తుందని ఎమ్మెల్యే కొరముట్ల అన్నారు. కార్యక్రమంలో అన్నమయ్యజిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉపసర్పంచ్ తోట శివసాయి, ఎం పిడిఒ ఎ.జాషువా, హౌసింగ్, జగనన్న కాలనికి సంబంధిత అధికారులు, గ్రామ సచివా లయ సిబ్బందితో పాటు వైసిపికి చెందిన ప్రముఖులు బుడిగి శివయ్య, రమేష్, నాగేంద్ర, వైఎస్ కరిముల్లా, వాటర్‌ప్లాంట్ రాజాతో పాటు వైసిపికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

## 14న విశ్వంలో ప్రాంగణ ఎంపికలు

కురబలకోట, జులై 12 ప్రభాతవార్త :

విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రమణారెడ్డి తెలిపారు. ఈ ప్రాంగణ ఎంపికలను హైదరాబాద్‌కు చెందిన లేబా రాట్రీస్ కంపెనీ నిర్వహిస్తోందని తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు ఇంటర్, డిగ్రీ, విద్యార్థులు హాజరు కావాలన్నారు.

## శుక్రవారం సామాజిక బహిరంగసభ

కురబలకోట, జులై 12 ప్రభాతవార్త :

కురబలకోట ఎంపిడిఓ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం 10గంటలకు సామాజిక బహిరంగ నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ దిలీప్‌కుమార్ తెలిపారు. మండలంలో మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద మండలంలోని ఆరు గ్రామ పంచాయితీల్లో ఏడాదిగా చేపట్టిన పనులపై సామాజిక ప్రజావేధిక నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## సీఎంకు హర్షం తెలిపిన జమియత్ ఉలమా ఏ హింద్

కడప వైద్యవిభాగం, జులై 12, ప్రభాతవార్త:

కడప నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న జమియత్ ఉలమా ఏ హింద్ కార్యాలయంలో జిల్లా సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షుడు హమీద్ హుసేన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనిఫాం సివిల్ కోడ్‌కు సంబంధించి సీఎం జగన్ వైఖరి పట్ల జమియత్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. ఈనెల 5వ తేదీన దేశ ప్రధానితో జరిగిన సమావేశంలో అప్రజాస్వామిక రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన దేశ మైనార్టీల పట్ల ప్రమాదకారి అయిన కామన్ సివిల్ కోడ్‌ను తను వ్యతిరేకిస్తున్నట్లు సీఎం స్పష్టం చేయడం పట్ల జమియత్ కడప జిల్లా శాఖ హర్షం వ్యక్తం చేస్తూ హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. మైనార్టీల అస్తిత్వాన్ని ప్రశ్నార్థకం చేసే కామన్ సివిల్ కోడ్‌కు తను వ్యతిరేకమని నేరుగా ప్రధానితోనే చెప్పడంతో సీఎం జగన్ తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే డాక్టర్ సుధ

పోరుమామిళ్ళ రూరల్, జులై 12

ప్రభాతవార్త :



ప్రజా సంక్షేమమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ సుధా అన్నారు. బుధవారం కలసపాడు మండలం, దిగువపల్లి సింగరాయపల్లె లోనిగడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధా పాల్గొన్నారు. . ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సుధా పలు వీధుల్లోని ప్రతి గడప - గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి నాలుగేళ్ల పాలనలో అందించిన సంక్షేమ బుక్ లను అందించి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించడం జరిగింది. అనంతరం ఆయా వీధుల్లో స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకొని సంబంధిత అధికారులకు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ముఖ్య నేతలు, జడ్పీటీసీలు, అంకన్న గారి గురువు రెడ్డి మండల అధ్యక్షులు నిర్మలా నారాయణ, ఎంపీటీసీ, కొండ దామోదర్ రెడ్డి లిప్ క్యాప్ డైరెక్టర్ సగిలి సుదర్శనం కొత్తకోట సహకార సంఘ ప్రెసిడెంట్ పెద్దిరెడ్డి పురుషోత్తం రెడ్డి రాజుపాలెం సర్పంచ్ సుధా రామకృష్ణారెడ్డి జె ఎస్ మండల కన్వీనర్ చిత్త రాజశేఖర్ రెడ్డి స ర్పంచ్ , సంజీవ్ రాజు వైసీపీ నాయకులు,కార్యకర్తలు, అధికారులు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి మహబూబ్ తాసిల్దార్ రవీంద్రారెడ్డి, మండల అధికారులు డ్వాక్రా మహిళలు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహ సారదులు, సచివాలయ బూత్ కన్వీనర్ పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష ప్రజా సంక్షేమానికి శ్రీరామరక్ష

### ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె, జులై 12,
ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష ప్రజా సంక్షేమానికి శ్రీరామరక్ష అని రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నఓరంపాడు పంచాయతీలోని సచివాలయంలో సర్పంచ్ గద్దె సిద్దమ్మ అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై పలు సంక్షేమ పథకాలు ప్రజాభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఎల్లవేళలా ప్రజల పక్షాన అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. విద్య, వైద్య గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు నిధులు కేటాయించి ప్రజల మనిషిగా జగన్‌మోహన్‌రెడ్డి గుర్తుండిపోయేలా ప్రజలకు చేరువై అనునిత్యం ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ టూరిజం డైరెక్టర్ సాయి కిశోర్‌రెడ్డి, వైసీపీ నాయకులు ముక్కా రమేష్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రసాద్, నాగినేని రమేష్‌నాయుడు, సుధాకర్ రాజు, అధికారులు తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎండీవో విజయారావు, ఏపీఎంఆర్‌సీ ఆర్ముగం, వైసీపీ కార్యకర్తలు, వైసీపీ నాయకులు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతిపల్లి రైతు భరోసా కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి వ్యవసాయ జిల్లా అధికారి చంద్రనాయక్

రామాపురం, జులై 12 ప్రభాతవార్త :



మండలంలోని సరస్వతి పల్లి రైతు భరోసా కేంద్రం ను అన్నమయ్య జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్ర నాయక్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ లో సాగుచేస్తున్న పంటలపై దృష్టి సారించాలన్నారు. పంట వేసే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు. అదేవిధంగా రైతు భరోసా కేంద్రాలలో ఎరువులు , పురుగు మందులు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అదేవిధంగా రైతు భరోసా కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించారు.. పిఎం కిసాన్ నగదు జమ కావాలంటే తప్పనిసరిగా రైతులు ఈ కే వై సీ చేయించుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి కౌలు రైతుకు కూడా సి సి ఆర్ సి కార్డులు అందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విఏఏ మురళీధర్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

## రాజగోపాల్ రెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ద్వారక

రామాపురం, జులై 12

ప్రభాతవార్త :



మండలములోని నల్లగుట్టపల్లె గ్రామం బి.రాచపల్లెకు చెందిన మోపురి రాజగోపాల్ రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు స్థానిక నాయుకుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్ రెడ్డి బుధవారం మోపూరి రాజగోపాల్ రెడ్డిని పరామర్శించి, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. రాజ గోపాల్ రెడ్డి త్వరగా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా కోలుకోవాలని ఆకాంక్షించారు ఆయన వెంట ఆంజనేయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిఎస్టి అన్ని రకాల వార్షిక రిటర్న్స్ గడువు పెంపు

కడప, జూలై 12 ప్రభాతవార్త



జిఎస్టి చట్టం వచ్చిన తర్వాత ప్రతి వ్యాపారస్తుడు జి.ఎస్.టి.ఆర్ 9 మరియు 9సి రిటర్న్స్ ప్రతి సంవత్సరము డిసెంబర్ నెల 31వ తేదీ లోపల ఫైల్ చేయవలసి ఉంటుంది. అలాగే కాంపొజిషన్ డీలర్స్ ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెల 30వ తేదీ లోపల వార్షిక రిటర్న్స్ ఫైల్ చేయవలసి ఉంటుంది. 2017-18 సంవత్సరం నుండి 2021-22 వరకు మన రాష్ట్రంలోనే కాకుండా మొత్తం భారతదేశంలో కొన్ని లక్షల మంది ఈ రిటర్న్స్ ఫైల్ చేయలేదు. ఈ రిటర్న్స్ ఫైల్ చేయని వ్యాపారస్తులకు లక్షల్లో పెనాల్టీ, నోటీసులు డిపార్ట్మెంట్ వారు ఇవ్వడం జరిగింది. మన రాష్ట్రంలోనే కాకుండా ఇండియా మొత్తం మీద వివిధ రకాల వ్యాపార సంఘాల నుండి వచ్చిన నివేదికలను ఆధారంగా చేసుకొని లక్షల్లో వస్తున్నటువంటి లేట్ ఫీజును తగ్గించవలసిందిగా 2022 డిసెంబర్ 19వ తేదీన ఆంధ్ర ప్రదేశ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి. షరీఫ్ ఖాన్ నేతృత్వంలో ఢిల్లీలోని జీఎస్టీ కౌన్సిల్ చైర్మన్ వివేక్ జోహరికి, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు ఒక రెప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది. ఈ రిప్రజెంటేషన్ను ఆధారంగా చేసుకొని 31-03-2023 వ తేదీన నోటిఫికేషన్ నెంబర్ 7/203 ద్వారా జిఎస్టిఆర్ 9,9సి ఫైల్ చేయని వారికి రూ. 20 వేలు అపరాధ రుసుముతో మరియు జిఎస్టిఆర్ -4 ఫైల్ చేయని వారికి 500 రూపాయలతో 30-06-2023 వరకు గడువును పెంచుతూ ఫైల్ చేయవలసిందిగా నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. మన రాష్ట్రంలోనే కాకుండా భారతదేశం మొత్తం రిటర్న్స్ ఫైల్ చేయని వారు ఉన్నందున వారి యొక్క వినతులను విన్న షరీఫ్ ఖాన్ తిరిగి 22-05-2023వ తేదీన మరియు 06-07-2023వ తేదీన జిఎస్టి కౌన్సిల్ కు మరియు ఆర్థిక మంత్రి నిర్మల సీతారా మన్‌కు 31-08-2023 వరకు గడువును పెంచమని అభ్యర్థించడం జరిగింది. ఈ అభ్యర్థనను స్వీకరించి తిరిగి 31-08-2023 వరకు అన్ని రకాల రిటర్న్స్ ఫైల్ చేసుకోవడానికి గడువు పెంచడం జరిగింది. కాబట్టి జిల్లాల్లోని వ్యాపార స్తులు ఎవరైనా రిటర్న్స్ ఫైల్ చేయనివారు ఉన్నట్లయితే వారికి రిటర్న్స్ ఫైల్ చేసుకోవాల్సిందిగా కోరడమైనది. రాష్ట్ర అధ్యక్షులు షరీఫ్ ఖాన్ చేసిన సేవలను గుర్తించి 01-07-2023 గుంటూరులో రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన అసోసియేషన్ సభ్యులు షరీఫ్ ఖాన్‌ని సన్మానించడం జరిగింది.

## పిల్లలకు విద్యా సామగ్రి పంపిణీ

చిట్వేలి, జులై 12

ప్రభాతవార్త



వ్యాలవత్తూరు సురేష్‌నాథ్డ్డి మనవరాలు నాగరితిక చార్వి రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బుధవారం వైఎస్ఆర్ కాలనిలో 30 మంది గిరిజన విద్యార్థులకు సిహెచ్ఎస్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి పంపిణీ చేశారు. పాఠశాల విద్యార్థులతో కలిసి కేక్ కట్‌చేసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సిహెచ్ఎస్ బాధ్యులు గాడి ఇంతియాజ్, ఎన్ఆర్ఐ ఇన్‌ఛార్జి సురేష్‌నాథ్‌లు మాట్లాడుతూ విశేష దినాలు పురస్కరించుకొని ఇలా గిరిజన పాఠశాల విద్యార్థులతో, కాలని వాసులతో కలిసి పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం హర్షణీయమని, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం పట్ల పసిపిల్లల మధ్య తారతమ్యాలు లేకుండా స్నేహభావం పెరుగుతుదని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు శ్రావణకుమారి కార్యక్రమం చేపట్టడంపై ఆనందం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమలో సురేష్‌నాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులు సురేఖ, సుప్రియ, సాయి, సిహెచ్ సభ్యులు వరుణ్‌కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ విశ్వవిద్యాలయం పరిశోధన ద్వారా మందులు పంపిణీ

రాజంపేట, జూలై 12

ప్రభాతవార్త



రైతులకు పురుగు మందులు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

డాక్టర్ వైఎస్ ఆర్ విశ్వావిద్యాలయం పరిశోధన కేంద్రం తిరుపతి వారిచే ఎంపిక చేసిన ఎస్. సి. రైతులకు పండ్ల మొక్కల సాగుకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులను పరిశోధన శాస్త్రవేత్తలు బుధవారం పంపిణీచేశారు. ఈ సందర్భంగా రాళ్లచెరువు పల్లి గ్రామం లో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నాగరాజు మాట్లాడారు. ఎస్. సి. సబ్ ప్లాన్ ద్వారా కొంత మంది రైతులను ఎంపిక చేసి వారి ద్వారా పండ్ల తోటల సాగు చేయిస్తామన్నారు. ఇందులో భాగంగానే ఈ సాగుకు సంబంధించి ఏడు మంది రైతులను ఎంపిక చేశామన్నారు. వీరికి ప్రభుత్వం ఉచితంగా ఎకరాకు అరటి అయితే 1200వందల ప్రకారం ప్రతి రైతుకు అర్ధ ఎకరానికి 600మొక్కలు, చీని, నిమ్మ అయితే 100మొక్కలు అందజేసి సాగుకు కావాల్సిన ఎరువులు, మందులు మొక్కల తో పాటు అందజేస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ముఖుందలక్ష్మి, శ్రీనివాస్ రెడ్డి, కవిత లతో పాటు రైతులు శ్రీను వాసులు, సుబ్రహ్మణ్యం, వేణు, దేవి, వెంకటయ్యలు హాజరయ్యారు.

### డాక్యుమెంట్ పోయినవి

పాలెటి అరుణ భర్త: పాలెటి నాగసుదర్శన్ రెడ్డి, మిట్టపల్లి గ్రా॥, వీరపునాయిని పల్లి మం॥, వైఎస్ఆర్ కడప జిల్లా. గల భూమి సర్వే నెం.250 విస్తీర్ణం 6.34 సెంట్లు, డ్యాకుమెంట్ నెం. 1698/2006 గల వీరపు నాయిని పల్లెకు పోయే దారిలో పోయినాయి. ఎవరికైనా దొరికిన యడల ఈ సెల్ నెం. 9676181745. 6305423263లకు చేయగలరని కోరుచున్నాము.

### పేరు మార్చుకోబడినది

(పాతపేరు) షేక్ సయ్యదా s/o. షేక్ మహమ్మద్ సైపుల్లా, డి.నెం. 12/48, చింతకుంట పల్లి, లక్కిరెడ్డిపల్లి మం. అన్నమయ్య జిల్లా - 516 257, నా కొత్తపేరు షేక్ మస్తాన్ సెల్ : 8121891064

## జగనన్న సురక్షలో 332 సర్టిఫికెట్లు పంపిణీ

దువ్వూరు, జులై 12, ప్రభాతవార్త:



మండల పరిధిలోని ఎడమడక గ్రామంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష పథకంలో ఎడమడక, నారాయణపల్లె గ్రామాలకు చెందిన ప్రజలకు 332 సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ 2 గ్రామాలకు సంబంధించి 623 టోకెన్లు వచ్చాయని వాటిని విచారించి 332 సర్టిఫికెట్లు జారీ చేశామన్నారు. ఇందులో కుల పత్రం 139, ఇన్‌కం 131, రైతు లకు చెందిన కౌలు కార్డులు 22, రేషన్ కార్డులు 17 అందజేసినట్లు తెలిపారు. జగనన్న సురక్ష ద్వారా ప్రజల ఇంటి వద్దకే వచ్చి ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి, ఏవో నాగేంద్ర బాబు, సర్పంచ్ రవణమ్మ పాల్గొన్నారు.

## అభివృద్ధి నిర్మాణాల పురోగతి పరిశీలన

పులివెందుల, జూలై 12, ప్రభాతవార్త ః



మోడల్‌టౌన్‌లో భాగంగా పులివెందులలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పాడా ఓఎస్డీ అనీల్‌కుమార్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. రాణితోపు, గరండాల వంక, పాత కూరగాయల మార్కెట్‌లో జరుగుతున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులను పరిశీలించారు. అనంతరం రాణితోపు, గరండాల ఫ్రంట్ రివర్ నిర్వహణకు అధికారులతో మాట్లాడారు. త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు విధివిధానాలను తయారు చేయాలని అధికారులకు సూచించారు. మోడల్‌టౌన్ అభివృద్ధి పనులపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని, కాంట్రాక్టర్లు నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనరు వి.నరసింహారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## వారంలోగా వంద శాతం మొక్కలు నాటడం పూర్తి కావాలి

### డ్వామా పీడీ మద్దిలేటి

పీలేరు, జూలై 12 ప్రభాతవార్తః



వారం రోజుల్లోగా మొక్కలు నాటే పనులు వంద శాతం పూర్తిచేయాలని అన్నమయ్య జిల్లా డ్వామా పీడీ మద్దిలేటి తెలిపారు. బుధవారం పీడీ పీలేరు మండలంలోని అగ్రహారం, బోడుమల్లువారిపల్లె పంచాయతీల్లో పర్యటించి, క్షేత్ర స్థాయిలో మామిడి మొక్కలు నాటే పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 200 ఎకరాల్లో తోటల పెంపకం లక్ష్యం కాగా, 350 ఎకరాల్లో మామిడి మొక్కలు నాటడానికి రైతుల ఆసక్తి చూపుతున్నా రని చెప్పారు. ఇప్పటి వరకు 320 ఎకరాల్లోమొక్కలు నాటడానికి గుంతలు తీసే పనులు పూర్తికాగా అందులో ప్రస్తుతం 150 ఎకరాల్లో మామిడి మొక్కలు నాటడం పూరైందన్నారు మిగిలిన రెండు వందల ఎకరాలను వారం రోజుల్లోగా వంద శాతం పనులు పూర్తిచేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలియజేశారు. రైతులుకు నచ్చిన మెచ్చిన మామిడి మొక్కలను ఎంపిక చేసుకుని నాటడానికి అనుమతిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం తరఫున తాము మొక్కల కోసం చెల్లిస్తున్న ధరకు అదనంగా రైతులు మొక్కలను ఎంపిక చేసుకుంటున్నారన్నారు. ఈ తనిఖీల్లో పీలేరు మండల ఏపీఓ మహేష్, రైతులు పాల్గొన్నారు.

## హెచ్ఎంఎం హైస్కూల్లో మధ్యాహ్న భోజనం తనిఖీ

రైల్వేకోడూరు రూరల్ , జులై 12 ప్రభాతవార్త



రైల్వేకోడూరు పట్టణంలోని హెచ్ఎంఎం హైస్కూల్ ఉన్నత పాఠశాలలో ఎంఇఒ సుందర్‌బాబు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం వెంకటరమణ, పిఇటి మేడమ్‌ల ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ నిర్వహించి భోజన వసతుల పట్ల ఎంఇఒ సుందర్‌బాబు సంతృప్తిని వ్యక్తం చేసినట్లు పాఠశాల సిబ్బంది తెలిపారు. ఇదే పాఠశాలలో పనిచేసి ఎంఇఒ స్థాయికి ఎదిగిన సుందర్‌బాబును అదే పాఠశాలకు చెందిన సహతోటి విద్యార్థులు సుందర్‌బాబును ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉంట ఏజెన్సి నిర్వాహకురాలు బత్తల జయప్రద, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ల సమస్యల పరిష్కారమే ఏపీ రెడ్డిసంఘం ధ్యేయం

పులివెందుల రూరల్, జూలై 12, ప్రభాతవార్త ః



రెడ్ల సమస్యల పరిష్కారమే ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ధ్యేయమని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గంగులగుంట నరేష్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం పులివెందుల నియోజకవర్గంలో రెడ్ల ఐక్య చైతన్యయాత్ర ద్వారా కొంతమంది రెడ్లను ఆయన కలిసి సమస్యలను తెలుసుకున్నారు. పట్టణంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్ల ఐక్యచైతన్య యాత్రలో మాదృష్టికి కొన్ని సమస్యలు వచ్చాయన్నారు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుందని రైతులు ఏపీ రెడ్డిసంఘం దృష్టికి తీసుకువచ్చారన్నారు. రెడ్డి కార్పొరేషన్‌కు రూ.1000కోట్ల నిధులు మంజూరు చేసి నిరుద్యోగ రెడ్డి యువతకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి, అదే విధంగా వ్యవసాయానికి ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని గోపాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొల్లూరు వెంకటరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష ప్రారంభించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు, జులై 12, ప్రభాతవార్త:



11, 12 వార్డులోని సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో జమ్మల మడుగు ఎమ్మెల్యే డా.మూలె సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు అన్నీ నెరవేర్చారని కొనియాడారు. జగనన్న సురక్ష ద్వారా పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకొని ఏదైనా ఇబ్బంది ఉంటే వెంటనే పరిష్కారం చేసి అలాగే ఒక టోకెన్ నెంబరు ఇచ్చి వారి సమ స్యలు పరిష్కరించే విధంగా పని చేయాలని తెలిపారు. పలు సమస్యలు తెలప డంతో వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, 2వ వైస్‌ఛైర్మన్ సింగ రయ్య, కౌన్సిలర్ పొచ్చిరెడ్డి, సచివాలయ కన్వీనర్ దంపెట్ల వేణుగోపాల్, పరిశ్రమల డైరెక్టర్ మార్బుల్ ఎను, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వైసీపీ అభిమానులు, సచివాలయ అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు వైఎస్సార్ చిరునవ్వు కిట్లు పంపిణీ

బ్రహ్మంగారి మఠం, జూలై 12 ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు వైఎస్సార్ చిరునవ్వు కిట్టును ప్రధానోపాధ్యాయులు నిర్మలా దేవి చేతుల మీదుగా అందించారు. ఈ ప్రాజెక్టు మండల ట్రైనీ ముండ్లపాటి విజయ భాస్కర్ విద్యార్థినులకు కిట్లు అందజేసి, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి లోపు విద్యార్థులకు ఉచితంగా పేస్టు, బ్రష్, 21 రోజుల టైం టేబుల్ చార్ట్‌ను విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం ఇస్తుందని, రాబోయే రోజులలో ప్రభుత్వం 2వేల మంది జనాభాను ఒక యూనిట్‌గా తీసుకొని ఒక దంత వైద్యశాలను ఏర్పాటుచేసే యోచనలో ప్రభుత్వం ఉందన్నారు. ప్రధానోపాధ్యాయురాలు నిర్మలా దేవి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని, ప్రతి ఒక్క విద్యార్థి పథకాలను పొందుతూ సద్వినియోగం చేసుకొని మంచిగా మెలగాలని, దంతాల ఆరోగ్యంపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు కొండారెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు ప్రభాకర్‌రావు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## అప్పయ్యరాజుపేటలో జగనన్న సురక్ష

పుల్లంపేట, జులై 12 ప్రభాతవార్త



పుల్లంపేట మండలం అప్పయ్యరాజుపేట సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని అర్హులైన ప్రతి పేదవారికి సంక్షేమ ఫలాలు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు వివిధ సమస్యలను ఎమ్మెల్యే, నియోజకవర్గ సీనియర్ వైసిపి నేత కొల్లం గంగిరెడ్డిల దృష్టికి తీసుకురాగా గడప గడప కార్యక్రమంలో రూ.20 లక్షలు మంజూరు చేస్తామని మండల కన్వీనర్ ముస్తాక్‌కు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎపిఎస్‌సి వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మడగలం శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ సలహాదారు సంఘం ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, మండల కన్వీనర్ ముస్తాక్, మణి, మల్లికార్జున, మండల స్పెషల్ ఆఫీసర్, తహశిల్దారు, ఎంపిడిఒ, కార్యదర్శి, ప్రజలు పాల్గొన్నారు. అనంతరం మడగలం శ్రీనివాసులు, సుకుమార్‌రెడ్డి, గంగిరెడ్డిలను ముస్తాక్ ఘనంగా సన్మానించారు.

## ఎమ్మెల్యే చేతుల మీదుగా కేఫ్ ప్రారంభం

బద్వేలు అర్బన్, జూలై 12 ప్రభాతవార్త :



మున్సిపాలిటీ పరిధిలోని మైదుకూరు రోడ్‌లో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన ఫుడ్ రిటైల్ ఫ్రాంచైజ్ వారి కేఫ్ లస్సీ షేక్స్ షాపును ఎమ్మెల్యే డా॥ సుధ, మున్సిపల్ ఛైర్మెన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి, ఏపి సివిల్ సప్లయ్స్ కార్పోరేషన్ డైరెక్టర్ సుందరరామి రెడ్డి, మున్సిపల్ కమీషనర్ కృష్ణారెడ్డి, మున్సిపల్ కన్వీనర్ యద్దారెడ్డి, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, బార్ అసోషియేషన్ అధ్యక్షులు పి.వి.ఎన్.ప్రసాద్‌తో పాటు పలువురు నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖుల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పలువురు నాయకులకు, ఆర్యవైశ్య ప్రముఖులకు, అధికారులకు కేఫ్ నిర్వాహకులు వల్లంకొండు పుష్పలత, శివ కుమార్‌లను ఘనంగా సత్కరించారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే డా॥ సుధ, మున్సిపల్ ఛైర్మెన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డితో పాటు పలువురు మాట్లాడుతూ నగరాన్ని తలపించేలా బద్వేలు పట్టణంలో కేఫ్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరం అన్నారు. ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని పరిశుభ్రంగా ఉండేలా అందజేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, సముద్రాల సుబ్బారావు, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు ధనమ్మ, అమ్మవారిశాల సెక్రటరి నాగరాజ, కౌన్సిలర్ చెవుల వెంకటేశ్వర్లు, తుమ్మలపెంట సురేష్ బాబు, పత్తి నాగేంద్ర ప్రసాద్, తులసి వెంకట శివ నారాయణ, అనిల్ కుమార్ రాజు, కె.సత్యనారాయణ, సూరే సుబ్బయ్య, బైసాని శంకర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

### కేఫ్ ప్రారంభోత్సవంలో బిజేపి నాయకులు:

బుధవారం మైదుకూరు రోడ్‌లోని వాసవీ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కేఫ్ ప్రారంభోత్సవంలో బిజేపి సీనియర్ నాయకులు, బొమ్మన ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొమ్మన సుబ్బరాయుడు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. వారికి కేఫ్ నిర్వాహకులు వల్లంకొండు శివకుమార్ సాదరంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దరిసి వెంకటేశ్వర్లు, మస్తాన్ రాజా, బి.వెంకటేశ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## కొర్రపాడులో జగనన్న సురక్ష

రాజుపాళెం, జూలై12, ప్రభాతవార్త.



మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో బుదవారం జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ శ్రీనివాసుల రెడ్డి,అధ్యక్షతన యంపిడిఓ సయ్యదున్నీసా ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్యేక అధికారి రాఘవేంద్రకుమార్,ఎంఆర్ఓ ఇందిరరాణిలతో పాటు ఇతర మండల స్థాయి,గ్రామస్థాయి అధికారులు పాల్గొని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనన్న సురక్ష కార్యక్రమంను నిర్వహించి అర్హులందరికి సేవాపత్రాలను పంపిణీ చేశారు.కొందరు రైతులు పంటపొలాలకు సంబందించిన రహదారి విషయంపై రెవిన్యూ అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏపిఓ గంగయ్య,ఏపియం జయరాజు,ఏయస్ఓ మహబూబ్‌బాష,హౌసింగ్ ఏఇ శేఖర్,విఆర్ఓ అశోక్‌కుమార్,కార్యదర్శి బాబు మరియు అన్నిశాఖల అధికారులు సచివాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీల ద్రోహి జగన్

(మొదటి పేజీ తరువాయి)

నిర్మించిన హజ్ హౌస్‌లను వినియోగంలోకి తేకపోగా వాటి నిర్వహణను కూడా పట్టించుకోకుండా నాశనం చేశారని మండిపడ్డారు. మైనార్టీల సంక్షేమానికి బడ్జెట్‌లో కేటాయించిన అరకొర నిధులను కూడా జగన్ నవరత్నాల పథకాలకు మళ్లించారని విరుచుకుపడ్డారు. మైనార్టీల అభివృద్ధి నిరోధక ప్రభుత్వమని ధ్వజమెత్తారు. ఈద్గా, మసీదులు, ముస్లిం స్మశానాల కోసం టిడిపి ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చి నిధులను మంజూరు చేసేదన్నారు. రాజంపేట ఈద్గాకు కూడా ఐదెకరాల స్థలాన్ని కేటాయించడంతో పాటు చుట్టూ ప్రహరీ నిర్మాణానికి 25 లక్షల నిధులు కూడా ఖర్చు చేసిన ఘనత తెలుగుదేశంపార్టీదేనన్నారు. మైనార్టీలకు తెలుగుదేశంపార్టీతోనే ప్రయోజనం అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే మరలా మైనార్టీలు బాగుపడతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి, జగన్‌మోహన్‌రాజు, పంతగాని నరసింహప్రసాద్‌తో పాటు తెలుగుదేశంపార్టీ మైనార్టీ నేతలు అబూబకర్, కరీం, డాక్టర్ సుధాకర్, రాష్ట్ర కల్లుగీత ఆర్థిక సహకార సంస్థ మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, గన్నే సుబ్బనరసయ్యనాయుడు, దగ్గుపాటి సుబ్రమణ్యం, కొండయ్యనాయుడు, టి.లక్ష్మీనారాయణ, భానుమూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గడపకు సంక్షేమ పథకాలు సీఎం లక్ష్యం

### 5వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



బద్వేలు అర్బన్, జూలై 12 ప్రభాతవార్త :

కుల, మతాలకు, పార్టీలకు అతీతంగా ప్రతి గడపలో ప్రజలకు సంక్షేమ పాలన అందించడమే ముఖ్యమంత్రి లక్ష్యం అని ఎమ్మెల్యే డా॥ సుధ, మున్సిపల్ ఛైర్మెన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి, కన్వీనర్ ఈగ యద్దారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు సచివాలయం పరిధిలో వార్డు ఇన్‌ఛార్జ్, మాజీ నీటి సంఘం అధ్యక్షులు సింగసాని శివయ్య, కౌన్సిలర్ గుర్రం రత్నమ్మల ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 5,6 వార్డులలో ప్రజలు పలు రకాల సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకున్న వారికి వివిధ రకాల ధృవీకరణ పత్రాలను పలువురు నాయకుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా॥ సుధ, మున్సిపల్ ఛైర్మెన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పులివెందుల తరువాత బద్వేలుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తూ బద్వేలు నియోజకవర్గానికి సుమారు రు.500 కోట్లు ప్రత్యేక నిధులను మంజూరు చేయడం జరిగిందని, ఇందులో భాగంగా మున్సిపాలిటీ అభివృద్ధి కొరకు రు.130 కోట్లు ప్రత్యేక నిధులు మంజూరు చేయడం జరిగిందని, ఇప్పటికి మున్సిపాలిటీలో చాలా వరకు సీసీ రోడ్లు పూర్తికావడం జరిగిందని, మరి కొద్ది నెలల్లోనే మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేసి ప్రత్యేక పార్కును కూడా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం వార్డు ఇన్‌ఛార్జ్ సింగసాని శివయ్య, రాజేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కొరకు సచివాలయంలోని వాలంటీరు వ్యవస్థ ఎంతగానో కృషి చేస్తున్నారని, ప్రజలకు అవసరమైన 11 రకాల ధృవీకరణ పత్రాలను అప్పటికప్పుడే ఉచితంగా సచివాలయం ద్వారా అందజేయడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ కల్లూరు వెంకటకృష్ణా రెడ్డి, వైసీపీ నాయకులు బంగారు శీనయ్య, రాగిమాను ప్రతాప్ కు మార్, వెంకటరత్నం యాదవ్, దూళ్ళ సుబ్బయ్య, పంగా చెన్నకృష్ణారెడ్డి, ప్రతా ప్, చెన్నయ్య, కృష్ణ, సచివాలయ సిబ్బందితో పాటు అధికారులు పాల్గొన్నారు.

## గుర్తించిన పనులను పూర్తి చేయాలి

దువ్వూరు, జులై 12, ప్రభాతవార్త:



ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులకు గుర్తించిన పనులను త్వరలో పూర్తి చేయాలని ఉపాధి హామీ ఏపీవో రామ చంద్రారెడ్డి అన్నారు. బుధవా రం స్థానిక ఎంపీడీవో కార్యాల యంలోని సభాభవనంలో ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడే అవకాశం ఉన్నందున గ్రామాల్లో అలాగే కేసీ కాలువ ఆయకట్టు పరిధిలో ఉప కాల్వల పనులు ఇంకా ఏవైనా రైతులకు సంబంధించిన పనులు ప్రణాళికలో ఉంటే పూర్తి చేయాలన్నారు. వర్షాలు పడిన తరువాత ఉపాధి హామీ పనులు చేసేందుకు వీలుండదని కావునా వాటికి ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. ఉపాధి హామీకి సంబంధించి రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని తెలిపారు. మస్టర్లలో ఎటువంటి కొట్టివేతలు ఉండరాదని తెలిపారు. గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఈసీ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ మహాసభల పోస్టర్ విడుదల

### – డిఈవో పురుషోత్తం

రాయచోటి టౌన్, జూలై 12ప్రభాతవార్త:



పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కలకత్తా నగరంలో ఆగస్టు 9, 10, 11వ తేదీ ల్లో జరగనున్న ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ మహాసభల పోస్టర్లను బుధవారం అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం విడుదల చేశారు. విద్యా ప్రగతి ప్రజాస్వామ్యం అనే లక్ష్యాలతో చదువు కోసం పోరాడు, సమాజ ప్రగతి కోసం చదువు అనే నినాదంతో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసి యేషన్ 1996 ఆగస్టు 9న ఆవిర్భవించిందన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమ య్య జిల్లా విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల లవకుమార్, రాయచోటి ఏరియా నాయకులు సాయి ప్రసాద్, చరణ్, వెంకటేష్, డిఈవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబును కలిసిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్‌రెడ్డి

బద్వేలు, జూలై 12 ప్రభాతవార్త :

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబా బు నాయుడును బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువ నేత రితీష్ రెడ్డిలు వారి నివాసంలో కలిశారు. భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈ కార్యక్రమంలో విజయమ్మ, రితీష్ రెడ్డిలకు చంద్రబాబు సూచించినట్లు సమాచారం. ఈ సందర్భంగా విజయమ్మ, రితీష్ రెడ్డిలు మాట్లాడుతూ యువగళం పాదయాత్రను బద్వేలు నియోజకవర్గంలో విజయవంతం చేయడమేగాక అశేష జనవాహిని మధ్య దిగ్విజయంగా నిర్వహించడంపై నాయకులు, కార్యకర్తలను చంద్రబాబు అభినందించినట్లు వారు తెలిపారు. ఓటరు వెరిఫికేషన్, ఇంటింటి సర్వే, మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన భవిష్యత్తు పథకాలను విస్తృతంగా ప్రజలలోకి తీసుకెళ్ళాలని చంద్రబాబు సూచించినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని కష్టపడి పనిచేసి గెలుపుకు నాంది పలకాలని వివరించినట్లు తెలిపారు. అంతే కాకుండా ప్రభుత్వ విధానాలను ఎండగట్టే విధంగా ముందుకు సాగాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన ప్రభుత్వంపై ప్రజలలో ఉన్న వ్యతిరేకతను తెలియజేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించినట్లు వారు తెలిపారు.

## వరదరాజస్వామి ఆలయానికి జీర్ణోద్ధరణ పనులు

చిట్వేలి, జులై 12 ప్రభాతవార్త



చిట్వేలి గ్రామ పరిధిలోని పాత చిట్వేలిలో మట్లి రాజులచే నిర్మితమై 400 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రను తనలో నింపుకున్న చారిత్రక దేవాలయం శ్రీ వరదరాజస్వామి ఆలయం. అట్టి దేవాలయం శిథిలావస్థకు చేరుకున్న తరుణంలో సదరు గ్రామస్థులు, స్థానిక ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి, రాజుకుంట సర్పంచ్ గుత్తి నరసింహులు తదితరులు కొంతమేర అందించిన ఆర్థిక సహాయంతో ఆలయ పెద్దలు స్లాబ్ పనులు బుధవారం మొదలు పెట్టారు. దాతలు స్పందించి ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయాలని, చారిత్రక వారసత్వ సంపదను పరిరక్షణకు తోడ్పాటు ఇవ్వాలని పాత చిట్వేలి గ్రామ యువత, ప్రజలు కోరుతున్నారు.

## బీరం సుబ్బారెడ్డి డిఈఓ రాఘవరెడ్డికి క్షమాపణ చెప్పాలి

### మండల ఉపాధ్యాయల సంఘాలు డిమాండ్

రామాపురం జులై 12, ప్రభాతవార్త



వైఎస్ఆర్ జిల్లా డీఈవో రాఘవరెడ్డిపై బీరం శ్రీధరరెడ్డి విద్యా సంస్థల అధినేత బీరం సుబ్బారెడ్డి రాఘవరెడ్డిపై నిందలు మోపడం సోషల్ మీడియాలో ప్రచారం చేయడం సరైంది కాదని అన్నమయ్య జిల్లా రామాపురం మండల ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు విమర్శించారు. బుదవారం రామాపురం మండలంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. దుర్ఘటన జరిగిన రోజు జిల్లాలోనే ఉన్న రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఈ విషయంపై ఆరాతీసి ఆ విద్యాసంస్థపై తగు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారన్నారు. ఎంతో నిబద్ధత తో సేవలందిస్తున్న డిఈవోపై బురద జల్లడం సబబు కాదన్నారు. ఆరోపణలు రుజువు చేయని పక్షంలో జిల్లా విద్యా శాఖ అధికారి రాఘవరెడ్డి కి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు,సమావేశంలో ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాల నాయ కులు, కనపర్తి. శివశంకర్‌రెడ్డి, కె.కుమారస్వామి, పి.యం. డి.రఫి, సి.చంద్ర శేఖర్ రెడ్డి, ఎ.రామచంద్ర, యస్.రమేష్ రెడ్డి, డి.మధుసూదన్ రెడ్డి, హెచ్. గంగాధర్, సి.సుబ్బారెడ్డి, రవి ప్రతాప్ ఉన్నారు.

## మండల క్షేత్రస్థాయి అధికారుల సమీక్షా సమావేశం



కడప వైద్యవిభాగం, జులై 12, ప్రభాతవార్త:

దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సీఎండీ కె.సంతోషరావు అధ్యక్షతన బుధవారం కడప ఐఎంఏ హాలు-2లో కడప డివిజన్ పరిధిలోని కడప, చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రి, వల్లూరు, చెన్నూరు మం డలాల క్షేత్రస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయి అధికారులు తాము సాధించిన అభివృద్ధిని గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించాలని తెలిపారు. అనంతరం సీఎండీ సంతోషరావు మాట్లాడుతూ దేవుడు మనకు ప్రజలకు సేవ చేసే అవకాశం ఇచ్చారని విద్యుత్తు సంస్థ తరుపున మనం వారికి చేయాల్సిన సేవలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. లైన్లలో తిరిగి సమస్యలు గుర్తించి ముందస్తు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు పగటి వేళల్లో 9 గంటల ఉచిత విద్యుత్తు సరఫరాలో ఎటువంటి జాప్యం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. డీబీటీ పథకం ద్వారా రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్తు అందించడమే కాకుండా సంస్థకు ప్రతి యూనిట్‌కు అకౌంటబిలిటీలోకి వస్తుంది ఈ డీబీటీ పథకం నిర్వహించడానికి రైతులు వద్ద నుంచి తీసుకోవాల్సిన బ్యాంకు వివరాలను వెంటనే తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బంది తమ విధులు సక్రమంగా నిర్వర్తిస్తే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. అలాగే విద్యుత్తు చౌర్యాన్ని అరికట్టాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని గట్టిగా హెచ్చరించారు. ఈ సమావేశంలో దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ చీఫ్ జనరల్ మేనజర్ గురవయ్య, ఓఎస్‌డీ ఎన్.శ్రీనివాసులు, వైఎస్ఆర్ జిల్లా విద్యుత్తు శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రమణ, అకౌంట్ ఆఫీసర్ మధు, కడప డివిజన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీరు ఎల్.నరసింహ ప్రసాద్, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లు, ఏఈలు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.

## కువైట్‌లో యువగళం పాదయాత్ర సంబరాలు

రాయచోటి, జులై 12, ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి నారా లోకేష్ బాబు యువ గళం పాదయాత్ర 2000 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగుదేశం పార్టీ అభిమానులు బుధవారం కువైట్ దేశంలో కేక్ కట్ చేసి నారా లోకేష్ బాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు కువైట్ టీం -2 మద్దిన ఈశ్వర్ నాయుడు కోశాధికారి ఏనుగొండ నరసింహనాయుడు ఉపాధ్యక్షుడు షేక్ బాషా అహమ్మది గవర్నర్ కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్ మైనార్టీ నాయకుడు షేక్ షాన్ భాషల ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి లోకేష్ బాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు లోకేష్ బాబు ప్రజలకు తెలుసుకుంటూ ఇలాగే ముందుకెళ్లాలని వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు.

## రేషన్‌లో కందిపప్పు మాయం.!

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుంది ఉత్తరప్రదేశ్ మధ్యప్రదేశ్లో పరిమితంగా సాగు జరుగుతుంది. గత రెండేళ్లుగా కందిక గిట్టుబాటు ధరలు లేకపోవడంతో సాగు క్రమేణ తగ్గిపోతూ వచ్చింది. గత ఏడాది దేశంలో 43.4 లక్షలు టన్నులు కందులు పండించగా మరో 15 లక్షలు టన్నులు దిగుమతి చేసుకున్నారు. అయితే ఈ ఏడాది మాత్రం దిగుబడి 38 లక్షలు టన్నులు దాటలేదు దీంతో కంది సాగు అధికంగా ఉన్న బర్మా సౌత్ ఆఫ్రికా ల నుంచి కందులను దిగుమతి చేసుకుంటున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం కూడా దేశ మార్కెట్ పై దృష్టి సారించడం లేదు నాఫెడ్ వద్ద నిలవలు తగ్గిపోతున్న కేంద్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో వ్యవహరించలేక పోతుంది. వివిధ రాష్ట్రాల్లో కూడా మార్క్ ఫేడ్ ద్వారా కొనుగోలు గణనీయంగా తగ్గించారు. ధరల పెరుగుదల విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పరిమితికి మించి సరుకు నిల్వ చేసిన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలను ఆదేశించింది. ఈ మేరకు గెజిట్ జారీ చేసింది ప్రస్తుతం దేశ ఉత్పత్తి తగ్గడంతో ధర 200 రూపాయల వరకు పెరగవచ్చు అని వ్యాపార వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో రేషన్ ద్వారా అయినా కందిపప్పు సరఫరా చేయకపోవడం పై ప్రజల్లో అసంతృప్తి నెలకొంది.

## దాడులను నిరసిస్తూ చేనేత వ్యాపారులు ర్యాలీ

### సబ్‌కలెక్టరేట్ ఏఓకు వినతి

మదనపల్లె, జులై 12 ప్రభాతవార్త :



సత్యసాయిజిల్లా లోని ధర్మవరంలో ఇటీవల పట్టు వస్త్ర వ్యాపారులపై రౌడీలు చేసిన దాడులను నిరసిస్తూ బుధవారం నీరుగుట్టవారిపల్లెకు చెందిన మదనపల్లె చేనేత మాస్టర్ వీవర్స్ అసోసియేషన్, చేనేత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. నీరుగుట్టవారి పల్లెలోని చౌడేశ్వరీ గుడి నుంచి ర్యాలీగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్ళి సబ్‌కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వస్త్ర వ్యాపారసంఘం నాయకులు మాట్లాడుతూ ధర్మవరం చేనేత పట్టుచీరల వ్యాపారులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆలయ సింగ్ యజమానిపై పీడియాక్టు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్‌కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో జడ్పిటిసి ఉదయ్‌కుమార్, కౌన్సిలర్లు ఆర్‌వి.శివారెడ్డి, ఎంవి.రమణ, ఎస్‌వి.రమణ, మాజీ కౌన్సిలర్ నీలకంఠ, బండినాగరాజు, ఆంజినేయులు, నాయకులు శీలం రమేష్, ఉప్పు రామచంద్రా, రామాంజనేయులు, మోడెం సిద్దప్ప, రమేష్‌లు పాల్గొన్నారు.

## బాకీ విషయంపై యువకుడిపై దాడి

లక్కిరెడ్డిపల్లె, జూలై 12 ప్రభాతవార్త :

లక్కిరెడ్డిపల్లె, యువకుడు బాకీ ఉన్నాడన్న నెపంతో నలుగురు యువకులు ప్రసాదు అనే యువకుని బైకుపై ఎక్కించుకొని దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. వివరాలలోకి వెలితే దాడిలో గాయపడిన యువకుడు ప్రసాదు రోళ్లమడుగు గ్రామము ఏకిలపల్లెకు చెందిన వాడని నెల రోజుల కిందట రోళ్లమడుగు గ్రామంలో ఓబైకు పగలకొట్టి అవ్వగారి ఊరు అయిన లక్కిరెడ్డిపల్లె మండలం పాళెంగొళ్లపల్లెలో చేరుకున్నాడని, దీంతో రోళ్లమడుగుకు చెందిన 6 మంది యువకులు బుదవారం అర్థరాత్రి పాళెంగొళ్లపల్లెకు వెళ్లి ప్రసాదు అనే యువకుని బాకీ డబ్బులు ఇవ్వాలని బైకులో వెక్కించుకోని వెలుతుండగా గ్రామస్తులు బైకును అడ్డుకొని యువకుని స్థానిక ఆసుపత్రికి తరలించి ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై మల్లికార్జునరెడ్డి తెలిపారు. దాడికి గురైన గాయపడిన ప్రసాదును స్థానికి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిర్వహించి కడప రిమ్స్ తరలించారు.